Fashion



## అరరే.. అరోరా!

చీరకట్టుతో కనికట్టు చేసే సౌందర్యం కొందరిదైతే.. చుడీదార్‌లో షాన్‌దార్ అనిపిస్తారు మరికొందరు. మలైకా ఆరోరా లాంటి సొగసుగత్తె ఏ ఆహార్యంలో అయినా 'ఔరా!' అనిపిస్తుంది. ఈ బాలీవుడ్ భామ తాజాగా తెల్లని వేస్ట్‌కోట్ ధరించి తళుకులీనింది. వంగపువ్వు రంగు హ్యాండ్‌బ్యాగ్ చేతబూని విలాసంగా కూర్చున్న ఈ భంగిమను చూస్తే.. దేవదాసు కూడా కాళిదాసై కావ్యం రాసేస్తాడేమో!!

# ఒలింపిక్స్‌లో మన వంట



**కేరళకు** చెందిన శ్రేయ ఆనంద్ చెన్నైలోని అమృతా కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నది. పంతొమ్మిదేండ్ల శ్రేయ తను ఏడో తరగతిలో ఉన్నప్పుడే చెఫ్‌గా స్థిరపడాలని నిర్ణయించుకుంది. అయితే వంటలక్కగా మారాలనుకున్న తన నిర్ణయానికి కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి ప్రోత్సాహం కరువైంది. అయినప్పటికీ ఆమె ఆ అవరోధాలను దాటుకుంటూ వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జర్మనీలో జరిగిన 'కలినరీ ఒలింపిక్స్'లో శ్రేయ రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించి సత్తా చాటింది. 124 ఏండ్ల ఈ వంటకాల ఒలింపిక్స్ చరిత్రలో పతకాలు సాధించిన తొలివ్యక్తిగా మనదేశానికి పేరు తెచ్చిపెట్టింది. అలా తన నిర్ణయం సరైనదేనని నిరూపించింది. ''ఈ పోటీల్లో నా ప్రదర్శన గురించి కొంత భయం ఉండేది. కానీ అక్కడ నేనెంతో నేర్చుకున్నాను. నిజానికి ఒక గొప్పకల నెరవేరింది' అని గర్వంగా చెబుతుంది శ్రేయ. ఈ పోటీలకు సంబంధించి వివిధ విభాగాల్లో ప్రదర్శన కోసం ఆమె రెండేండ్లుగా తన ప్రతిభకు మెరుగులు పెట్టుకుంటూ ఉన్నది. ఇప్పుడు తన దృష్టంతా 2026లో లగ్జెంబర్గ్‌లో జరగబోయే 'వంటల వరల్డ్ కప్' మీదే. పాకశాస్త్రం ప్రావీణ్యంలో శ్రేయ తన సృజనాత్మకతను మరింత గొప్పగా ప్రదర్శిస్తుందని ఆశిద్దాం.


నమస్తే తెలంగాణ

# జిందగీ

13

హైదరాబాద్ | గురువారం 28 మార్చి 2024 www.ntnews.com







## రవ్వ ఢోక్లా



### కావలసిన పదార్థాలు

**బొంబాయి రవ్వ:** రెండు కప్పులు, **పుల్లటి పెరుగు:** ఒక కప్పు, **పచ్చిమిర్చి:** నాలుగు, **ఉప్పు:** తగినంత, **చక్కెర:** ఒక టీస్పూన్, **ఆవాలు, నువ్వులు:** అర టీస్పూన్ చొప్పున, **నూనె:** పావు కప్పు, **కరివేపాకు:** ఒక రెబ్బ, **అల్లం:** అంగుళం ముక్క, **బేకింగ్ సోడా:** పావు టీస్పూన్, **బేకింగ్ పౌడర్:** ఒక టీస్పూన్.

### తయారీ విధానం

రవ్వను మిక్సీ జార్‌లో వేసి ఒక నిమిషంపాటు గ్రైండ్ చేసుకోవాలి. రెండు పచ్చిమిర్చి, అల్లం కచ్చాపచ్చాగా దంచుకోవాలి. ఒక గిన్నెలో రవ్వ, పెరుగు, ఉప్పు, చక్కెర, పచ్చిమిర్చి మిశ్రమం వేసి కొద్దికొద్దిగా నీళ్లుపోసి ఇడ్లీ పిండిలా కలిపి మూతపెట్టి పదినిమిషాలు పక్కన పెట్టాలి. నానిన పిండిలో బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా వేసి మరోసారి బాగా కలపాలి. ఒక గిన్నెకు నూనెరాసి రవ్వ మిశ్రమం వేసుకోవాలి. వెడల్పాటి కుక్కర్‌లో నీళ్ల పోసి, రవ్వ మిశ్రమం వేసిన గిన్నె పెట్టి ఆవిరిపై 20 నిమిషాలు ఉడికించాలి. బాగా ఉడికిన ఢోక్లాను చల్లారాక ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి.. వేడయ్యాక ఆవాలు, నువ్వులు, చీల్చిన పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేగిన పోపును ముక్కలుగా కోసుకున్న ఢోక్లాపై వేసుకుని కలుపుకొంటే ఘుమఘుమలాడే ఫలహారం సిద్ధం.



బాల్య వివాహం ఆమె తెలివి తేటల్ని కట్టడి చేసింది. 'పెండ్లి.. పిల్లలు.. డిగ్రీ ఫెయిల్... వయసుకు మించిన బాధ్యతలు.. 'ఏమిటీ జీవితం?' అనుకుంటున్న రోజుల్లో కాలేజీలో చదువుకొమ్మని భర్త సలహా ఇచ్చాడు. కాలేజీకి దారి చూపాడు. అలా మొదలైన ప్రయాణం ఎంత దూరం సాగిందో, ఎంతెత్తుకు ఎదిగిందో? చెబుతున్నది తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి **జస్టిస్ రాధారాణి**. హేతువాద భావాలు, సాహిత్యాభిలాషతో కోటి ఆశలు పెంచుకున్న తెలివైన బాల్యానికి వివాహంతో కామా పడ్డట్టయింది. ఆ అగాధం నుంచి న్యాయ శిఖరాలకు సాగిన ఆమె ప్రయాణం నేటి మహిళకు స్ఫూర్తి పాఠం!

*Justice Radha Rani*

# చిరుధాన్యాలు రోజూ తినొచ్చా?

ఫుడ్ సైన్స్

**అన్నం పూర్తిగా మానేసి మిల్లెట్ (చిరుధాన్యాలు) డైట్ పాటించడం మంచిదేనా. చిన్నప్పటి నుంచి మనకు అలవాటైన వరి అన్నాన్ని నెలల తరబడి వదిలిపెట్టడం వల్ల ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందా! మిల్లెట్ డైట్ తీసుకొనే వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**• ఓ పాఠకురాలు**

**మనం** పుట్టినప్పటి నుంచి వరి అన్నం తింటున్నాం. అలాంటిది షుగర్ అదుపులోకి రావాలనో, బరువు త్వరగా తగ్గాలనో ఉన్నట్టుండి దాన్ని పూర్తిగా మానేసి చిరుధాన్యాల మీద ఆధారపడటం మంచిది కాదు. ఇందులో ఉండే హై ఫైబర్ వల్ల జీర్ణవ్యవస్థ మీద ఒక్కసారిగా భారం పెరిగిపోతుంది. అందులోనూ ఈ ఆహారం కొందరికి పడొచ్చు. కొందరికి పడకపోవచ్చు. కాబట్టి మూడు పూటలా మిల్లెట్‌డైట్‌కి వెంటనే మారిపోకూడదు. నెమ్మదిగా దీన్ని అలవాటు చేసుకోవడం ముఖ్యం. ముందు ఒకసారి తీసుకునే ఆహారంలో దీన్ని చేర్చుకోవాలి. ఉదాహరణకు బ్రేక్‌ఫాస్ట్... మిల్లెట్ ఇడ్లీ, దోశ, ఉప్మా లాంటివి వారంలో రెండు మూడుసార్లు తీసుకోవడం మొదలుపెట్టి కొద్ది రోజుల తర్వాత రోజూ తీసుకోవచ్చు. అందులోనూ దోశల్లాంటి వాటికి సగం బియ్యం సగం మిల్లెట్‌లు... ఇలా ఉండేలా చూసుకోవాలి. అంటే మనం రోజూ తినేవాటితో వీటిని కలిపి తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం విషయానికి వస్తే.. రాగి ముద్ద, బియ్యంలో కొర్రలు లేదా ఇతర మిల్లెట్లు కలిపి అన్నంలా వండుకోవచ్చు. ఇలా అలవాటు చేసుకున్నాక, మొత్తంగా చిరుధాన్యాలు తినొచ్చు. అది కూడా మొదట్లో రోజు విడిచి రోజు తినాలి. ఇలా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అలవాటయ్యాక, రాత్రి కూడా మిల్లెట్లు తినడానికి ప్రయత్నించొచ్చు. చపాతీల్లాంటివి తినేవారు గోధుమ పిండి, మిల్లెట్ పిండి కలిపి చేసుకోవచ్చు.



**మయూరి ఆవుల**
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com

అలాగే మల్టీగ్రెయిన్ ఆటా... అంటే రాగులు, కొర్రలు, జొన్నలు అన్నీ కలిపి పట్టించుకున్నవి తినొచ్చు. ఇలా అలవాటు అయ్యాక... మన ఇష్టాన్ని బట్టి ఏవో ఒక రెండు మిల్లెట్‌లు రెగ్యులర్‌గా ఉండేలా చూసుకోవాలి. ఇలా నెమ్మదిగా మూడు పూటలా మిల్లెట్ డైట్ అలవాటు చేసుకోవచ్చు. అందులోనూ ఒక్కో రోజు ఒక్కో రకం చొప్పున... కొర్రలు, రాగులు, జొన్నలు, సజ్జలు... అన్ని రకాలూ తినగలిగితే మంచిది. వారంలో నాలుగు లేదా అయిదు రోజులు ఈ మిల్లెట్ డైట్ పాటిస్తున్నా సరే, మిగతా రెండు మూడు రోజులు చక్కగా మామూలు భోజనం చేయొచ్చు. అయితే చిరుధాన్యాలు సరిగ్గా ఉడకకపోతే అజీర్తి చేయడం, కడుపునొప్పి రావడంలాంటివి జరగొచ్చు. అందుకే రాత్రంతా నానబెట్టి వండుకోవాలి. లేదా పిండి పట్టుకోవాలి. వీటిలో ఉండే గాయిట్రోజెన్‌లు అయోడిన్ శోషణను ఇబ్బంది పెడతాయి. అందుకే థైరాయిడ్ సమస్య ఉన్న వాళ్లు తప్పకుండా పోషకాహార నిపుణుల సలహా మీదే ఈ డైట్ పాటించాలి.



# నాన్న.. నేను.. న్యాయస్థానం





**మీ ప్రయాణం ఎక్కడినుంచి మొదలైందో చెబుతారా?**

**మాది** తెనాలి. అక్కడ మా ఇంటిమీద 'ఎం.ఎన్.రాయ్ భవన్' అని రాసి ఉంటుంది. మా నాన్న గురిజాల సీతారామయ్య. ఆయన ఎం.ఎన్.రాయ్ ప్రభావంలో ఉండేవారు. మా తమ్ముడికీ అదే పేరు పెట్టారు. నాన్న హేతువాది, మానవతావాది. అమ్మానాన్నలు పెద్దగా చదువుకోలేదు. అమ్మ రాజేశ్వరి గృహిణి. నాన్న చిన్న బడ్డీకొట్టు నుంచి వ్యాపారం మొదలుపెట్టి హోటల్ రంగంలో స్థిరపడ్డారు. నాకు అక్క, చెల్లి, తమ్ముడు ఉన్నారు. మా చుట్టుపక్కల గ్రామాల్లో హేతువాద భావాల ప్రభావం ఉండేది. అప్పుడప్పుడు మా ఇంట్లోనూ హేతువాదులు సమావేశం అయ్యేవాళ్లు.

**హేతువాద ఉద్యమాల్లో ఉన్న మీ నాన్నగారు చిన్న వయసులో పెండ్లి ఎందుకు చేశారు?**

**అభ్యుదయ** మార్గంలో వెళ్తున్నాం అనుకునే వాళ్లు కూడా ఒక్కో మెట్టు ఎక్కుతూనే పోవాలి. ఒకేసారి పూర్తి మార్పును ప్రదర్శించలేరు. కొన్ని విషయాల్లో సాధారణ ప్రజల్లాగే నిర్ణయాలు తీసుకుంటారు. ఒక వెనుకబడిన కులంలో పుట్టిన అబ్బాయితో నాకు పెండ్లి చేయడమే మా ఇంట్లో ఒక విప్లవం. మంత్రాల పెండ్లికి నాన్న ఒప్పుకోలేదు. త్రిపురనేని రామస్వామి ప్రభావంతో తన పిల్లలకు దండల పెండ్లి చేస్తానని నిర్ణయం తీసుకున్నారు. మాకు దండల వివాహం (సివిల్ మ్యారేజ్) చేశారు. నాన్న నమ్మిన సిద్ధాంతాలు పాటించేవాడు. 'బిడ్డల పెండ్లికి కట్నం ఇవ్వను, ఆడపిల్లలకు ఆస్తిలో భాగం ఇస్తాను' అన్నాడు. అలాగే చేశాడు.

> చిన్నప్పుడు బాగా చదివేదాన్ని. తెలివైన స్టూడెంట్‌నని డబుల్ ప్రమోషన్ ఇచ్చారు. రెండో తరగతి చదవలేదు. ఏడో తరగతి తర్వాత మెట్రిక్యులేషన్ చదివించారు. అలా పద్నాలుగేండ్లకే ఇంటర్ పూర్తిచేశాను.

**పెండ్లయ్యాక చదువు ఆపాలని ఆంక్షలు ఎదురయ్యాయా?**

**మా** అమ్మ చేసిన ఒక మంచిపని ఏమిటంటే... 'పెండ్లి తర్వాత మా అమ్మాయిని డిగ్రీ వరకు చదివించాలి. డిగ్రీ పూర్తయ్యే వరకు మా ఇంట్లోనే ఉంటుంది' అని వివాహానికి ముందే కండిషన్ పెట్టింది. కాబట్టి చదువు ఆగలేదు. ఫైనల్ ఇయర్‌లో గర్భవతిని. ప్రాక్టికల్స్ మాత్రం రాయమని మా లెక్చరర్లు చెప్పారు. అలాగే చేశాను. చివరికి సప్లిమెంటరీలో డిగ్రీ పాస్ అయ్యాను.

**ఎల్.ఎల్.బి చదివేప్పుడు జడ్జి కావాలనే కోరిక ఉండేదా?**

**ఏదో** ఒకటి చదవాలని ఎల్.ఎల్.బి చేశాను. మా ఆయన చెరుకూరి లక్ష్మీ నరసింహ గాంధీకి ఏలూరు ఆర్టీవోగా ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పటికే మాకు ఇద్దరు అమ్మాయిలు. చదువు మీద ఆసక్తి పోయింది. ఆయనకేమో నన్ను చదివించాలని ఉండేది. పట్టుబట్టి ఏలూరులో సీఆర్ఆర్ లా కాలేజీలో ఎల్.ఎల్.బిలో చేర్పించారు.

**మీరు మొదటగా గెలిచిన కేసుని ఎంజాయ్ చేశారా?**

**న్యాయవాదిగా** నా కెరీర్ అనుకున్నంత సంతృప్తిగా ఏం సాగలేదు. కొన్ని కేసులు జాయింట్ కలెక్టర్ విచారించేవాళ్లు. మా ఆయన గ్రూప్ వన్ ఆఫీసర్. అధికారి భార్య కాబట్టి ఏమైనా ఇన్‌ఫ్లూయెన్స్ ఉంటుందేమోనని కొన్ని కేసులు ఇచ్చేవాళ్లు! అలాంటి కేసు గెలిచాను. అయితే, ఆ ఆనందం కాసేపు కూడా నిలబడలేదు. 'ఆc.. ఆడపిల్ల కాబట్టి ఇచ్చేశారులే' అని అపోజిట్ లాయర్ అన్నాడు. మా ప్రతిభతో కేసు గెలిచినా గుర్తించలేదు. వారన్న మాటలు నాకు అవమానంగా అనిపించాయి. ఎంత ప్రతిభ ఉన్నా.. మహిళను తక్కువగా చూడటం ఈ సమాజానికి అలవాటే కదా!

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగం ఎందుకు ఎంచుకున్నారు?**

**ప్రైవేట్** ప్రాక్టీస్‌లో రాణించాలంటే ఎన్నో వ్యవహారాలు ఉంటాయి. న్యాయవాద కుటుంబంలోంచి వచ్చిన వాళ్లయి ఉంటే కేసులు ఇబ్బడిముబ్బడిగా వచ్చేవి. మామూలు లాయర్ అంటే చెట్టు కింద ప్లీడరే! నా మనస్తత్వానికి ఇది వర్కవుట్ కాదని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) ఉద్యోగాల కోసం పరీక్ష రాశాను. ఎంపికయ్యాను. ఒకప్పుడు కోర్టుకుపోతే ఒకటో అరో కేసులు దొరికేవి. ఏపీపీ ఉద్యోగంలో రోజూ కేసులు వాదించాల్సి వచ్చేది. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నప్పుడు మీరు నోరు విప్పొద్దని కొంత మంది డబ్బు ఆశ చూపేవాళ్లు. నేను వాటికి దూరమని తెలిసి.. వెనక్కి తగ్గారు. ప్రలోభాలకు గురికాకుండా నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటం వల్ల మంచి గుర్తింపు, గౌరవం దక్కాయి. తర్వాత 2004లో జూనియర్ సివిల్ జడ్జిగా చేరాను. డిస్ట్రిక్ట్ జడ్జిగా 2008లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయ్యాను. అక్కడినుంచి హైకోర్టుకు వచ్చాను.

**ఏండ్లుగా న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు కదా! మీరు విధించే శిక్షలకు నేరాలు తగ్గుతాయంటారా?**

**శిక్ష** విధించడం వల్ల నేరాలు తగ్గుతాయని అనుకోలేం. నేర స్వభావం కలిగిన వాళ్లు సమాజంలో స్వేచ్ఛగా సంచరిస్తే ఇబ్బందే! వాళ్లకు కారాగార శిక్ష విధించి, పరివర్తన తెచ్చిన తర్వాత సమాజంలోకి పంపాలని చట్టం చెబుతుంది. నేరస్తుడికి శిక్ష వేసినంత మాత్రాన వారిలో పరివర్తన వచ్చేస్తుందని చెప్పలేం. చట్టానికి దొరకని నేరస్తులు ఎందరో ఉన్నారు. మరి వారిని మార్చేదెవరు?

**మీకు బాగా ఇష్టమైన పుస్తకాలు?**

**చిన్నప్పటి** నుంచీ పుస్తకాలు చదవడం అలవాటు. మాలతీ చందూర్ వ్యాసాలు చదివాక.. ఆ పుస్తకాలను కొనేదాన్ని. చలం, రంగనాయకమ్మ, యండమూరి, మధుబాబు, మల్లాది వెంకటకృష్ణమూర్తి నవలలు చదివేదాన్ని. ఓల్గా రచన 'స్వేచ్ఛ', జపాన్ నవల 'రైలుబడి', మాలతీ చందూర్ 'ఆలోచించు', రంగనాయకమ్మ నవలలు 'జానకి విముక్తి', 'స్వీట్‌హోమ్' చాలా ఇష్టమైన పుస్తకాలు.

**సినిమాల్లో కోర్టు సీన్లు చూస్తుంటే ఎలా అనిపిస్తుంది?**

**సినిమాల్లో** కోర్టు సీన్లు వింతగా అనిపిస్తాయి. పాత్రలన్నీ పెద్దపెద్ద డైలాగులు చెప్పేస్తుంటాయి. వాస్తవానికి అలాంటి వాతావరణం ఏం ఉండదు. కేసు ఏమవుతుందోనని వారి తరఫు న్యాయవాదులు ముద్దాయిలను కిక్కురుమనకుండా ఉండాలని చెబుతారు. వాళ్లకు మౌనంగా ఉండే హక్కు ఉంటుంది. ఆ మౌనాన్ని ఏ రకంగా అన్వయించుకోవాలో మేం నిర్ణయించుకుంటాం.

**మహిళా న్యాయవాదులు... మగవాళ్లతో సమానంగా రాణించలేకపోతున్నారెందుకు?**

**లాయర్లకు** యాక్సిడెంట్ ఎక్కడైతే అక్కడికి పోయి కేసులు తీసుకునే దుస్థితి ఉంటుంది. ఆడవాళ్లు అలా వెళ్లలేరు. మనదాకా వచ్చి కేసులు ఇవ్వాలంటే గుర్తించేంత స్థాయికి ఎదగాలి. కేసులు రాకుండాఎదిగే అవకాశం లేదు. అందుకనే ఈ ఫీల్డులో సీనియర్ లాయర్ల పిల్లలు, వారి బంధువుల పిల్లలకే అవకాశాలు త్వరగా లభిస్తాయి. కొత్తవాళ్లకు అంత సులభం కాదు. అవకాశం దొరికినా నిలదొక్కుకోవడం కష్టం.

**చివరగా... లాయర్‌గా రాణించాలంటే..?**

**ఊరి** నుంచి వచ్చిన జూనియర్ లాయర్‌ను మనవాడని చేరదీసే సీనియర్ లాయర్ ఉంటేనే కెరీర్‌లో నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఏ కులం వాళ్లు ఆ కులం లాయర్ దగ్గరికి వెళ్తున్నారు. కులం, మతం, ప్రాంతం ఇవన్నీ అవకాశాలు కల్పిస్తాయి. మొదట్లో కేసులు అలాగే వస్తాయి. మంచి పేరు వచ్చాక క్లయింట్ల సంఖ్య పెరుగుతుంది. ఏదేమైనా ఫస్ట్ జనరేషన్ లాయర్లకు అవకాశాలు తక్కువనే చెప్పాలి. ఈ వృత్తిలో రాణించాలంటే.. జూనియర్ సివిల్ జడ్జి (క్యాడర్ అపాయింట్‌మెంట్), పబ్లిక్ ప్రాసిక్యూటర్ లాంటి పోటీపరీక్షలు రాయడం మంచిది.

### ■ పాఠం చెప్పింది ఆయనే!

**మా** ఆయన పేరు గాంధీ. వాళ్ల నాన్న హిందీ టీచర్. మాకు ట్యూషన్ చెప్పారు. పెండ్లికి ముందు మా ఆయన డిగ్రీ చదువుతూ మాకు ట్యూషన్ చెప్పారు. తనకు ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీలో సీటు వచ్చింది. కాలేజ్ ఫీజు కట్టడానికి మా అమ్మ సాయం చేసింది. పీజీ తర్వాత ఆయన గ్రూప్ వన్ (ఆర్టీవో) అధికారిగా ఎంపికయ్యారు. తనకు పెండ్లి సంబంధాలు వస్తున్నాయి. అబ్బాయి గురించి కొందరు ఆడపిల్ల వాళ్లు మా అమ్మానాన్నల్ని వాకబు చేశారు. అప్పుడు అమ్మ ఆలోచించి 'మనమ్మాయిని ఇస్తే బాగుంటుంది కదా!' అని నాన్నతో అన్నారు. ఆయన గుణగణాలు తెలిసి నాన్న 'సరే' అన్నారు. అలా డిగ్రీ ఫస్ట్ ఇయర్ పరీక్షల తర్వాత మా పెండ్లయింది. అప్పటికి నా వయసు పదహారేండ్లు!



**... నాగవర్ధన్ రాయల**

**సి.ఎం. ప్రవీణ్**